# బలగం TV
BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 19 డిసెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## టెట్ పరీక్ష షెడ్యూల్ విడుదల

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టిఎస్ టెట్) 2024 పరీక్ష షెడ్యూల్ విడుదలైంది. 2025 జనవరి 2వ తేదీ నుంచి 20వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ విధానంలో టెట్ పరీక్షను నిర్వహించనున్నారు. పది రోజుల పాటు 20 సెషన్లలో టెట్ పరీక్షలు నిర్వహించనున్నట్లు టిజి టెట్ చైర్మన్, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఇవిఎన్ రెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 11.30 వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 వరకు రెండో సెషన్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రెండో విడత టెట్ పరీక్షకు మొత్తం 2,75,773 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పేపర్ 1కు 94,335 దరఖాస్తులు రాగా, పేపర్ 2కు 1,81,438 దరఖాస్తులు వచ్చాయి. ఈ ఏడాది మే నెలలో నిర్వహించిన టెట్‌కు 2,86,386 దరఖాస్తులు రాగా, ప్రస్తుత టెట్‌కు 2,75,773 దరఖాస్తులు వచ్చాయి.

# అసెంబ్లీలో డ్రంకెన్ డ్రైవ్ పంచాయితీ





- అసెంబ్లీకి కొంతమంది ఎమ్మెల్యేలు మద్యం తాగి వస్తున్నారన్న హరీశ్ రావు..
- తప్పుపట్టిన అధికార పక్షం సభ్యులు
- కాళేశ్వరం పేరుతో హరీశ్‌రావు దోచేశారన్న మంత్రి కోమటి రెడ్డి
- హరీశ్‌రావు వర్సెస్ కోమటిరెడ్డి

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

శాసనసభలో బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీఆర్ఎస్ సభ్యులు హరీశ్‌రావు మధ్య తీవ్ర వాగ్వివాదం జరిగింది. ఒకరిపై మరొకరు ప్రత్యారోపణలు చేసుకుంటూ సభను హీటెక్కించారు. మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వారిస్తున్నా తగ్గేదే లేదన్నట్లు కోమటిరెడ్డి మాట్లాడారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని వృథా చేయొద్దు అన్నా.. హరీశ్‌రావు, కోమటిరెడ్డిలిద్దరూ మాటకు మాట అనుకుంటూ అనవసర చర్చకు దారితీశారు. అభ్యంతరకర వ్యాఖ్యలు చేసుకున్నారు. అసెంబ్లీకి కొంతమంది ఎమ్మెల్యేలు మద్యం తాగి వస్తున్నారన్న హరీశ్ రావు.. రోడ్లపై నిర్వహించినట్లుగా.. అసెంబ్లీ దగ్గర కూడా డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలి అని అన్నారు. అంతే.. ఒక్కసారిగా సభలో తీవ్ర గందరగోళం రేగింది. అధికార పక్షం సభ్యులు హరీశ్ రావు వ్యాఖ్యల్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ఎలా అని ఫైర్ అయ్యారు. హరీశ్‌రావు వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి స్పందించారు. ఇలాంటి అభ్యంతర వ్యాఖ్యలు చెయ్యవద్దని ఫైర్ అయ్యారు. అంతేకాదు.. కాళేశ్వరం పేరుతో హరీశ్‌రావు దోచేశారన్న ఆయన.. ఈ ఆరోపణలను తాను నిరూపిస్తా అని అన్నారు. దాంతో.. ఈ వ్యాఖ్యలపై హరీశ్ రావు అభ్యంతరం చెప్పారు. చివరకు వారిద్దరికీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సర్దిచెప్పారు.

'సభను సజావుగా సాగేలా చూడండి. ఇద్దరు సభ్యులు చేసిన వ్యాఖ్యలను అసెంబ్లీ రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించారు. పలు రోడ్లను జాతీయ రహదారులుగా మార్చాలని సభలో సభ్యులు మదన్‌మోహన్‌రావు, పాల్వాయి హరీశ్‌బాబు, ప్రశాంత్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి అడిగిన ప్రశ్నలకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమాధానమిస్తూ పదేండ్ల కాలంలో తెలంగాణలో రోడ్ల విధ్వంసం జరిగిందన్నారు. కనీసం గుంతలను కూడా పూడ్చలేదని విమర్శించారు. ఉప్పల్-ఘట్‌కేసర్ రోడ్డు ఏడేండ్లుగా పూర్తిగాక ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పైసలు వచ్చే కాళేశ్వరం మీద తప్ప రోడ్లపై దృష్టిపెట్టిన పాపాన పోలేదని విమర్శించారు. అదే సమయంలో మాజీ సీఎం ఫాంహౌస్ చుట్టూ ఆరు ఎక్స్‌ప్రెస్ వేలను రూ.700 కోట్లతో వేశారని తెలిపారు. రామగుండం -హైదరాబాద్ రహదారిని ఎన్‌హెచ్‌కు ఇస్తామనీ, ఆరులైన్లకు విస్తరిస్తామని హామీనిచ్చారు. కల్వకుర్తి నుంచి శ్రీశైలం వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తామని తెలిపారు. ప్రతి గ్రామం నుంచీ మండల కేంద్రాలకు రోడ్లు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్లు వేస్తామని మరోమారు చెప్పారు. తామేం చేయలేదన్నట్టు మంత్రి మాట్లాడటం తగదని హరీశ్‌రావు అనడంతో...99 శాతం పనులు అయిపోతే తమకు ఇప్పుడేం పని ఉండేది కాదని అన్నారు. హరీశ్‌రావుకు దబాయించడం మాత్రమే తెలుసని అన్నారు.

హరీశ్‌రావు వారించేం దుకు యత్నించగా...'నువ్వేం చేశావ్..కమీషన్లు తీసుకుని కూలిపోయే కాళేశ్వరం కట్టినవ్. బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోడ్లు వేయ చేతకాలేదు. ఆర్ఆర్‌ను 30 ఏండ్లకు అమ్ముకున్నారు' అంటూ మంత్రి వెంకటరెడ్డి కామెంట్ చేశారు. తన ఇన్నేండ్ల కాలంలో ఒక్క రూపాయి కూడా లంచం తీసుకోలేదన్నారు. మామ చాటు అల్లుడైన హరీశ్‌రావు కాళేశ్వరం మీద రూ.10 వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. తన గురించి ఆయన మాట్లాడేది ఏంది? అన్నారు. ప్రశ్న వరకే మంత్రి పరిమితం కావాలని స్పీకర్ సూచించారు.

## శాసనసభ ముందుకు భూభారతి బిల్లు

- ప్రవేశపెట్టిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నూతన రెవెన్యూ చట్టం తీసుకువస్తోంది. భూ దస్త్రాలు, యాజమాన్య హక్కుల చట్టం-2024 పేరుతో న్నే అసెంబ్లీలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బిల్లును ప్రవేశపెట్టారు. ప్రస్తుతం అమల్లో ఉన్న ఆర్వోఆర్-2020ను రద్దు చేసి దాని స్థానంలో భూభారతి పేరుతో తీసుకొచ్చిన బిల్లును మంత్రి సభ ముందు ఉంచారు. భూమి పేదరికాన్ని దూరం చేసి ఆత్మగౌరవంతో జీవించేలా చేస్తుందని.. గ్రామాల్లో భూమి ప్రధాన జీవన ఆధారమని పొంగులేటి అన్నారు. కష్టజీవులను కంటికి రెప్పలా చూసుకునే బాధ్యత ప్రభుత్వాలదని చెప్పారు. 1971లో తెచ్చిన ఆర్వోఆర్ చట్టం 49 ఏళ్లపాటు మనుగడలో ఉందన్నారు. గతంలో తెచ్చిన ధరణి పోర్టల్‌తో కొత్త సమస్యలు తలెత్తాయన్నారు. ధరణితో అనేక మంది ఇబ్బందులు పడ్డ మాట వాస్తవమని సభలో వెల్లడించారు. ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని హామీ ఇచ్చామని.. ఇప్పుడు ఆపని చేస్తున్నట్లు చెప్పారు. ధరణి స్థానంలో భూభారతిని తీసుకువస్తున్నామని తెలిపారు. 18 రాష్ట్రాల్లో ఆర్ఓఆర్ చట్టాలు పరిశీలించి భూభారతి తెచ్చామన్నారు. గతంలో అర్ధరాత్రి ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చారని విమర్శించారు. ధరణి పోర్టల్ వల్ల 4 నెలలు రిజిస్ట్రేషన్లు జరగలేదన్నారు.

బేషజాలకు పోయి తాము ధరణిని మార్చడం లేదని.. ప్రజా సమస్యల పరిష్కారానికి ధరణి పోర్టల్ రద్దు చేస్తున్నట్లు పొంగులేటి వెల్లడించారు. ఎమ్మెల్యేలు, మేధావులు ఇచ్చిన అంశాలను డ్రాఫ్ట్‌లో పెట్టామన్నారు. మనుషులకు ఆధార్ ఎలాగో.. భూములకు భూదార్ అలా ఉంటుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయంలో ధరణి పేరుతో పేదల భూములు దోచుకున్నారని పొంగులేటి ఆరోపించారు. కొత్త చట్టం అమల్లోకి వచ్చాక ఆ భూములను వెనక్కి తీసుకుంటామన్నారు. వాటిని భూములు లేని నిరు పేదలకు ఇస్తామని స్పష్టం చేశారు.




# మౌనమెందుకు మోడీ..?

- అదానీ అంశంతో పాటు, మణిపూర్ అల్లర్లపై ఎందుకు మాట్లాడటం లేదు
- అదానీ విషయంలో బీఆర్ఎస్ స్టాండ్ ఏంటో చెప్పాలి.
- సీఎం రేవంత్‌రెడ్డి
- కాంగ్రెస్ చలో రాజ్‌భవన్
- రోడ్డు పై బైటాయించి సీఎం నిరసన

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

అదానీ అంశంతో పాటు, మణిపూర్ అల్లర్లపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. అదానీ విషయంపై పార్లమెంట్‌లో చర్చకు కేంద్రం అంగీకరించకపోవటం.. మణిపూర్ అంశంపై ప్రధాని మోదీ మాట్లాడాలని డిమాండ్ చేస్తూ.. ఏఐసీసీ దేశ వ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో చలో రాజ్ భవన్ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం రేవంత్ రోడ్డుపై బైటాయించి నిరనస వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు దీనిలో పాల్గొన్నారు. రాజ్‌భవన్ సమీపంలో రోడ్డుపై సీఎం రేవంత్, మంత్రులు, నేతలు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ వ్యవహారంపై వినతిపత్రం అందించేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వకపోవటంతో.. రాజ్ భవన్‌కు 100 మీటర్ల దూరంలోనే రేవంత్ రోడ్డుపై బైఠాయించి నిరనన వ్యక్తం చేశారు.

అనంతరం మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. అదానీ అంశంతో పాటు, మణిపూర్ అల్లర్లపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. 'ప్రభుత్వమే ధర్నాలు చేయడం ఏంటని కొందరు ప్రశ్నిస్తున్నారు. మా నిరసన కొందరికి నచ్చకపోవచ్చు. అదానీ, మోదీ దేశం పరువు తీస్తున్నారు. పార్లమెంట్‌లో నిలదీసినా స్పదన లేదు. ముందు అదానీ విషయంలో బీఆర్ఎస్ స్టాండ్ ఏంటో చెప్పాలి. 75 ఏళ్ల పాటు కష్టపడి కాంగ్రెస్ దేశ ప్రతిష్టను పెంచింది. కానీ అదానీ, ప్రధాని ఇద్దరు కలిసి దేశం పరువు తీశారు. వ్యాపారం చేసేందుకు అదానీ అంచాలు ఇచ్చారని అమెరికా సంస్థలు తేల్చాయి. అంశంపై మాట్లాడేందుకు, చర్చించేందుకు ప్రధాని మోదీ మౌనం వహిస్తున్నారు. మా పోరాటం ఇక్కడితో ఆగదు. ప్రధాని మోదీ మౌనం వీడకపోతే రాష్ట్రపతి భవన్ ఎదుట ధర్నా చేస్తాం. జేపీసీ వేస్తే తప్పకుండా అదానీ జైలుకు వెళ్తారు. వేయకపోతే మోదీనే అదానీని కాపాడినట్లవుతుంది. అదానీతో మోదీ లాలూచీ ఒప్పందం చేసుకున్నారు. బీఆర్ఎస్, బీజేపీ చీకటి ఒప్పందం చేసుకున్నాయి. అరెస్ట్ వార్తలు రాగానే హుటాహుటిన కేటీఆర్ ఢిల్లీకి వెళ్లి కేంద్ర పెద్దలతో ఒప్పందం చేసుకున్నారు. నాణానికి ఒకవైపు మోదీ, మరోవైపు కేసీఆర్ ఉంటారు. అని రేవంత్ విమర్శించారు.

## అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలపై కాంగ్రెస్ అభ్యంతరం



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం రేపాయి. ఆయన వ్యాఖ్యలపై పార్లమెంట్ దద్దరిల్లింది. 'జై భీమ్...జైజై భీమ్, అమిత్ షా క్షమాపణ చెప్పాలం'టూ ప్రతిపక్షాల నినాదాలతో హోరెత్తింది. అమిత్ షాను కేంద్ర హోం మంత్రి పదవి నుంచి తొలగించాలంటూ రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున్ ఖర్గే డిమాండ్ అమిత్ షా అంబేద్కర్, భారత రాజ్యాంగాన్ని అవమానించారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ఆయనకు మనుస్మృతి, ఆర్ఎస్ఎస్ భావజాలం- బాబా సాహెబ్ అంబేద్కర్, ఆయన రచించిన రాజ్యాంగాన్ని గౌరవించకూడదని నేర్పుతోందని ఆరోపించారు. అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, వెంటనే ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

"అంబేద్కర్ గురించి హోం మంత్రి మాట్లాడుతున్నప్పుడు మేమంతా ఆపేందుకు ప్రయత్నించాం. అంబేద్కర్ పేరును 100సార్లు జపించే బదులు భగవంతుని నామాన్ని ఇన్నిసార్లు స్మరించి ఉంటే ఏడుసార్లు స్వర్గానికి వెళ్లి ఉండేవారమని అమిత్ షా అన్నారు. ఆ సమయంలో నేను మాట్లాడేందుకు చేయి ఎత్తాను. కానీ మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. రాజ్యాంగంపై చర్చ జరుగుతున్నందున అందరం సహకరించాలని నిర్ణయించుకుని మౌనంగా కూర్చున్నాం. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ను దూషిస్తే దేశవ్యాప్తంగా నిరసనలు చెలరేగుతాయి. అంబేద్కర్‌ను అవమానిస్తే విపక్షాలు ఊరుకోవు." అని ఖర్గే పార్లమెంట్ ఆవరణలో మీడియాతో వ్యాఖ్యానించారు. మనుస్మృతిని విశ్వసించే వారే అంబేద్కర్?ను వ్యతిరేకిస్తారని లోక్‌సభలో పక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు.



## ఆటోలో అసెంబ్లీకి బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

ఆటో డ్రైవర్లకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సంఘీభావం తెలిపారు. ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోరుతూ.. ఖాకీ చొక్కాలు ధరించి తెలంగాణ అసెంబ్లీకి బయల్దేరారు. ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి అసెంబ్లీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆటోల్లో ర్యాలీగా బయలుదేరి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. ఆటో కార్మికులను ఆదుకోవాలంటూ ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు. కాగా, ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గడిచిన ఏడాది కాలంలో 93 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఆ మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా 8 లక్షల మంది ఆటో డ్రైవర్లకు ఎన్నెన్నో హామీలు ఇచ్చిందని, ఇచ్చిన ఆ హామీల్లో ఏ ఒక్కటీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల జాబితాను గత అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేసినా ఆ కుటుంబాలను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని తెలిపారు. ఇప్పటికైనా వారిని ఆదుకోవాలని కోరారు.ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లను ఎన్నికల కోసం వాడుకుని, వారికిచ్చిన హామీలన్నింటిని మర్చిపోయారన్నారు.ఆటో డ్రైవర్లకు ఇస్తామని చెప్పిన రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని వెంటనే ప్రకటించాలని, ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు ఎవరూ ఆత్మహత్యలకు పాల్పడవద్దని, వారికి బీఆర్ఎస్ అండగా ఉండి పోరాడుతుందని హామీ ఇచ్చారు.

## దమ్ముంటే ఫార్ములా ఈ రేస్‌పై చర్చ పెట్టండి

- రేస్ గురించి అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు
- సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ

వివరాలు 2వ పేజీలో

## రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెడుతున్న సీఎం

- ఎమ్మెల్సీ కవిత

వివరాలు 2వ పేజీలో

## లగచర్ల ఘటన నిందితులకు బెయిల్

- షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిన నాంపల్లి స్పెషల్ కోర్ట్

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో




లగచర్లలో కలెక్టర్‌పై దాడి కేసులో అరెస్టయిన మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి, మరో 23 మంది రైతులకు బెయిల్ లభించింది. ఈ కేసులో ఇప్పటికే వాదనలు విన్న హైదరాబాద్ నాంపల్లి కోర్టు తీర్పును రిజర్వ్ చేయగా బుధవారం నిందితులకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. పట్నం నరేందర్ రెడ్డికి రూ. 50 వేల పూచీకత్తు, రెండు షురిటీలు, మిగతా వారికి రూ. 20 వేల చొప్పున పూచీకత్తు, ఒక షూరిటీ సమర్పించాలని కోర్టు ఆదేశించింది. అంతేకాకుండా 3 నెలల పాటు ప్రతీ బుధవారం పట్నం నరేందర్ రెడ్డి పోలీసుల ముందు విచారణకు హాజరు కావాలని కోర్టు ఆదేశించింది.

## నా వ్యాఖ్యలను వక్రీకరించారు : కేంద్ర హోంమంత్రి అమిత్ షా



బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి తప్పుడు ప్రచారం చేస్తోందంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా కాంగ్రెస్ పార్టీపై తీవ్రంగా మండిపడ్డారు. అంబేద్కర్‌పై తాను అనుచిత వ్యాఖ్యలు చేశానంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్‌కు, రాజ్యాంగానికి, రిజర్వేషన్లకు వ్యతిరేకమని ఎదురుదాడి చేశారు. ఢిల్లీలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నేతలు రాజ్యాంగ విలువలను ఉల్లంఘించారన్నారు అంబేద్కర్‌ను ఎప్పటికీ, కనీసం కలలోనూ అవమానించలేని పార్టీ నుంచి వచ్చినట్లు అమిత్ షా చెప్పారు.

'కాంగ్రెస్ రాజ్యాంగ వ్యతిరేక పార్టీ. ఆయనకు భారతరత్న ఇవ్వలేదు. కేంద్రంలో బీజేపీ మద్దతు ఉన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరణానంతరం ఆయన(అంబేద్కర్)కు భారతరత్న ఇచ్చింది. కాంగ్రెస్ ఏనాడూ అంబేద్కర్ స్మారకాన్ని నిర్మించలేదు. బీజేపీ ప్రభుత్వం అంబేద్కర్‌ను ఎంతో గౌరవించిందని అమిత్ షా తెలిపారు. ఎలాంటి గందరగోళం లేకుండా స్పష్టంగా ఉన్న నా ప్రసంగం రాజ్యసభ రికార్డుల్లో ఉంది. కలలో కూడా అంబేద్కర్ ఆలోచలను అవమానించలేని పార్టీ, సిద్ధాంతం నుంచి వచ్చా. ఎమర్జెన్సీ విధించడం ద్వారా రాజ్యాంగ విలువలను ఉల్లంఘించింది కాంగ్రెస్. ఆ వాస్తవాలన్నీ బయటకు రాగానే కాంగ్రెస్ తన పాత ట్రిక్కులను ఉపయోగించి వాస్తవాలను వక్రీకరిస్తుంది అని అమిత్‌షా ధ్వజమెత్తారు.

## అమిత్‌షా కాంగ్రెస్ చీకటి చరిత్రను బయటపెట్టారు : ప్రధాని మోడీ

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



కాగా, పార్లమెంటులో అమిత్‌షా మాట్లాడిన వీడియోను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ షేర్ చేస్తూ బుధవారం ఒక ట్వీట్ చేశారు. అమిత్‌షా కాంగ్రెస్ చీకటి చరిత్రను బయటపెట్టారని, ఆయన మాట్లాడిన వాస్తవాలను చూసి వాళ్లు ఉలిక్కిపడటంతో కొత్త నాటకాలు ఆడుతున్నారని, ప్రజలకు మాత్రం నిజం తెలుసునని అన్నారు. కాంగ్రెస్ హయాంలో అంబేద్కర్‌కు భారతరత్న ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలను కించపరచేందుకు రాజవంశం నేతృత్వంలోని ఓ పార్టీ చేసిన ప్రయత్నాలు దేశ ప్రజలందరికీ తెలుసునని గాంధీ ఫ్యామిలీని పరోక్షంగా తప్పుపట్టారు. అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం అవిశ్రాంతంగా కృషి చేస్తోందని, ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేయడం, స్వచ్ఛ భారత్, పీఎం ఆవాస్ యోజన వంటివి ఈతరహాలోనివేనని మోదీ ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

## 'జమిలి'పై జేపీసీ ఏర్పాటు చేసిన కేంద్రం

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో

జమిలి ఎన్నికల బిల్లుల పరిశీలన కోసం సంయుక్త పార్లమెంటరీ కమిటీని కేంద్ర ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో భాజపా తరపున అనురాగ్ ఠాకూర్, కాంగ్రెస్ తరపున ప్రియాంకా గాంధీ తదితరులకు చోటు కల్పించినట్లు తెలిసింది. ఇందులో 21 మంది లోక్‌సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉండనున్నారు. జేపీసీ ప్రతిపాదనను కేంద్ర న్యాయశాఖ మంత్రి గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. జేపీసీకి లోక్‌సభ నుంచి 21 మంది సభ్యులను నియమించారు. సభ్యులుగా ప్రియాంకా గాంధీ, మనీష్ తివారీ, సుఖదేవ్ భగత్, సీఎం రమేశ్, బాలశౌరి వల్లభనేని, జీఎం హరీశ్ బాలయోగి, పురుషోత్తం రూపాల, అనురాగ్ ఠాకూర్, భర్తృ హరి మెహతాబ్, సుప్రియా సూలే, శ్రీకాంత్ షిండే, పీపీ చౌదరీ, బాన్సురీ స్వరాజ్, విష్ణుదయాళ్ రామ్, సంబిత్ పాత్రా, అనిల్ బలూనీ, విష్ణుదత్ శర్మ, ధర్మేంద్ర యాదవ్, కల్యాణ్ బెనర్జీ, టీఎం సెల్వ గణపతి, సుప్రియా సూలే, శ్రీకాంత్ శిండే, చందన్ చౌహాన్ ఉన్నారు

## ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ

- ఎమ్మెల్యే హరీశ్‌రావు

బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో



రేవంత్‌రెడ్డి సర్కస్ ఫీట్లు చూసి ఊసరవెల్లి సిగ్గుపడుతుందని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడారు. ఢిల్లీలో దోస్తీ, గల్లీలో కుస్తీ చేస్తున్నారన్నారు. రాజ్ భవన్ ముట్టడిలో అదానీ గురించి రేవంత్ రెడ్డి మాట్లాడలేదని, కేసీఆర్ గురించి మాట్లాడుతు న్నారన్నారు. తాము రేవంత్ రెడ్డి, అదానీ ఫోటోతో అసెంబ్లీకి వస్తే తమను అడ్డుకున్నారన్నారు. అదానీతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రూ.12 వేల కోట్ల ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలన్నారు. అదానీపై రేవంత్ రెడ్డి పోరాటం నిజమైతే ఒప్పందాలు ఎందుకు రద్దు చేసుకోవడం లేదని ప్రశ్నించారు. అదానీకి రూ.వంద కోట్లు వాపస్ ఇచ్చినట్టు రూ.12,400 కోట్ల ఒప్పందాలు రద్దు చేసుకోవాలన్నారు. రామన్నపేటలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీకి రేవంత్‌రెడ్డి అనుమతులు ఇస్తున్నారన్నారు. అదానీకి రేవంత్ రెడ్డి కొమ్ము కాస్తున్నారన్నారు. రోడ్డుపై రేవంత్ రెడ్డి సర్కస్ ఫీట్లు చేస్తున్నారని విమర్శించారు. రేవంత్ రెడ్డి అదానీకి ఏజెంట్ లా పని చేస్తున్నారన్నారు. అదానీకి రెడ్ కార్పెట్ వేసి తెలంగాణ పరవును, రాహుల్ గాంధీ పరువును రేవంత్ రెడ్డి మంట కలిపారన్నారు. నేడు అసెంబ్లీలో అదానీ, రేవంత్ రెడ్డి సంబంధంపై చర్చ పెట్టాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డిని ఆ పార్టీ తిడితే రూ.100 కోట్లు అదానీకి వాపస్ ఇచ్చారన్నారు. చట్టం అందరికీ సమానమైతే కాంగ్రెస్ నేతలపై సీపీ సీవీ ఆనంద్ కేసులు పెట్టాలన్నారు.

## సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి

- టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు

వివరాలు 2వ పేజీలో

# రాష్ట్రాన్ని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెడుతున్న సీఎం



- **ఎమ్మెల్సీ కవిత**

**బలగం టీవీ, హైదరాబాద్**

సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణను, హైదరాబాద్‌ను ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెడుతున్నారని ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు.

మూసీ పరివాహక ప్రాంతంలో పేద ప్రజల నుంచి భూములు లాక్కొని ప్రపంచ బ్యాంకుకు తాకట్టు పెట్టి రియల్ ఎస్టేట్ చేయాలని అనుకుంటున్నారని కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఈ మేరకు ప్రపంచ బ్యాంకుకు 2024 సెప్టెంబర్ 19వ తేదీన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించిందని అన్నారు. ఆ ప్రతిపాదనల్లో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అని స్పష్టంగా రాసి ఉందని తెలిపారు. కానీ మంత్రి శ్రీధర్‌బాబు మాత్రం మూసీ ప్రాజెక్టు కాదు.. మురుగునీటి శుద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు రుణాన్ని కోరామని అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. ఇప్పుడు డీపీఆర్‌లు లేవని ప్రజలకు, చట్టసభలకు తప్పుడు సమాచారం ఇవ్వడం కరెక్ట్ కాదని అన్నారు.

తెలంగాణను పదేళ్ల పాలించిన కేసీఆర్ ఏనాడూ రుణం కోసం ప్రపంచ బ్యాంకును ఆశ్రయించలేదని గుర్తుచేశారు.అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ముందు మోకరిల్లుతోందని విమర్శించారు. మూసీ పరివాహక ప్రాంతంలో పేదల నుంచి భూములు లాక్కొని ప్రపంచ బ్యాంకుకు తాకట్టుపెట్టి రియల్ ఎస్టేట్ చేయాలని అనుకుంటున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ బ్యాంకుకు పంపిన ప్రతిపాదనల్లో స్పష్టంగా మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ ప్రాజెక్టు అని స్పష్టంగా రాసుందని తెలిపారు. కానీ మంత్రి శ్రీధర్ బాబు మాత్రం మూసీ ప్రాజెక్టు కాదు.. మరుగునీటి శుద్ధికి సంబంధించి ప్రపంచ బ్యాంకు రుణాన్ని కోరామని తప్పుడు విషయం చెప్పారని విమర్శించారు. రియల్ ఎస్టేట్, ల్యాండ్ పూలింగ్ చేసి పెద్ద పెద్ద భవంతులు కడుతామని ప్రతిపాదనల్లో పేర్కొన్నారని అన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసించే ప్రజల్లో భయానక పరిస్థితి నెలకొందని తెలిపారు. 15 వేల ఇళ్లకు మార్కింగ్ చేయడం వల్ల తమ ఇళ్లను ఎప్పుడు కూల్చుతారో అన్న భయం వారిలో నెలకొందని ఎమ్మెల్సీ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు పునరావాసం ఎక్కడ కల్పిస్తారో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేయబోయే రియల్ ఎస్టేట్ లో నిర్వాసితులకు ఏం వస్తుందో ప్రభుత్వం స్పష్టమైన ప్రణాళికను వెల్లడించాలని సూచించారు.

### ఆదిలాబాద్‌లో పాఠశాలల వేళల మార్పు

**బలగం టీవీ, హైదరాబాద్**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రతతో అల్లాడుతున్న విద్యార్థుల కోసం పాఠశాలల వేళలను మారుస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మారిన సమయాల ప్రకారం పాఠశాల పని వేళలను ఉదయం 9.40 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్ణయించారు. ఈ ఉత్తర్వులు నేటి నుంచి (డిసెంబర్ 19) అమల్లోకి రానున్నాయి. దీంతో తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు చలి తీవ్రత తగ్గే వరకు ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలల పని వేళలను గురువారం నుంచి మార్చనున్నారు.

## సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ బుధవారం విడుదలైంది. ఈ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, ఫలితాల ప్రకటన తదితర తేదీలను అధికారులు వెల్లడించారు. తాజాగా ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్ ఇలా ఉంది.

నామినేషన్ల దాఖలు: 18.12.2024 నుండి 19.12.2024 వరకు సాయంత్రం 4.00 గంటల వరకు.

నామినేషన్ల చెల్లుబాటు జాబితా ప్రచురణ: 19.12.2024 సాయంత్రం 5.00 గంటలకు.

నామినేషన్ల ఉపసంహరణ: 20.12.2024 నుండి 21.12.2024 మధ్యాహ్నం 3.00 గంటల వరకు.

తుది జాబితా ప్రచురణ: 21.12.2024 సాయంత్రం 5.00 గంటలకు.

పోలింగ్ తేదీ: 04.01.2025 (ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల) వరకు.

ఫలితాల ప్రకటన: 04.01.2025 సాయంత్రం 5.00 గంటల నుండి.

## యూట్యూబర్, నటుడు బెహరా ప్రసాద్ అరెస్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రముఖ యూట్యూబ్ నటుడు బెహరా ప్రసాద్‌ను హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. సహచర నటిని వేధించిన కేసులో పోలీసులు అతనిని అరెస్ట్ చేశారు. మణికొండకు చెందిన బాధితురాలు అతనిపై ఫిర్యాదు చేసింది. పోలీసులు వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి ప్రసాద్‌ను కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి అతనికి 14 రోజుల రిమాండ్ విధించారు. అతనిని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఓ వెబ్ సిరీస్ షూటింగ్ సమయంలో బెహరా ప్రసాద్ తనకు పరిచయమయ్యాడని, అప్పుడు తనతో ఓసారి అసభ్యంగా ప్రవర్తించాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొన్నిరోజుల తర్వాత మరో వెబ్ సిరీస్‌లో కలిసి పని చేశామని, ఆ సమయంలో అందరిముందు తనతో అసభ్యంగా ప్రవర్తించాడని తెలిపింది. దీనిపై ప్రశ్నిస్తే దూషించాడని, ఈ నెల 11న షూటింగ్ నుంచి ఇంటికి వెళుతున్న సమయంలో అందరి ముందే తనపై దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొంది.



## సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి

- **టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు**

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ( టీఎఫ్‌డీసీ) ఛైర్మన్‌గా సినీ నిర్మాత వి.వెంకటరమణ రెడ్డి అలియాస్ దిల్ రాజు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మాసాబ్‌ట్యాంక్‌లోని టీఎఫ్‌డీసీ కార్యాలయంలో వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య ఆయన బుధవారం పదవీ ప్రమాణం చేశారు. ఈ సందర్బంగా దిల్‌రాజుకు సమాచార పౌర సంబంధాల ప్రత్యేక కమిషనర్ డాక్టర్ హరీశ్ పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు చెప్పారు. దిల్ రాజు మాట్లాడుతూ తెలంగాణలో సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ కి చెందిన షుటింగ్స్ తెలంగాణలో మరింత ఎక్కువగా జరిగే విధంగా ప్రయత్నిస్తానని అన్నారు. ఎగ్జిబిటర్స్ సమస్యల పరిష్కారంతో పాటు, సినీ నిర్మాతలకు షూటింగ్ ల అనుమతులను సింగల్ విండో ద్వారా లభించేందుకు కృషి చేస్తానని అన్నారు.



## చిరు సత్కారం

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో నూతనంగా సిరిసిల్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా ఎన్నికైన చుక్క రాజశేఖర్, ఎల్లారెడ్డిపేట మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన పొత్తూరి శివ గౌడ్ కి యూత్ కాంగ్రెస్ నాయకులు సమావేశం నిర్వహించి జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎస్ కె సాహెబ్ శాలువా తో సత్కరించారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు దుర్గాప్రసాద్, అఖిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# దమ్ముంటే ఫార్ములా ఈ రేస్‌పై చర్చ పెట్టండి

- **సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ లేఖ**

**బలగం టీవి, హైదరాబాద్**



దమ్ముంటే ఫార్ములా - ఈ రేస్ అంశంపై శాసనసభలో చర్చ పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. "ఫార్ములా-ఈ రేస్ వ్యవహారంలో మీ ప్రభుత్వం కొన్ని నెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీద, ముఖ్యంగా నా మీద అనేక నిరాధార అరోపణలు చేస్తున్నది. ఇదే విషయం మీద ఈ వారం మీ ఆధ్వర్యంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్టు వార్తా కథనాలు వచ్చాయి. ఇదే అంశం మీద కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ ఆమోదం వచ్చిందని రకరకాల లీకులు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి మీడియాకు ఇస్తున్నారు. ఈ అంశం మీద నాలుగు గోడల మధ్య చర్చ కన్నా రాష్ట్ర శాసన సభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయి. తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా-ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకున్నది. 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకున్నది. ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల రూపాయల లబ్ది చేకూరింది అని నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసింది. 2024లో మరో దఫా రేస్ జరగవలసి ఉండగా మీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దాన్ని ఏకపక్షంగా రద్దు చేయడం జరిగింది. అప్పటి నుండి రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగింది అనే అపోహలు సృష్టించే ప్రయత్నం మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది"

"నిజానికి ఫార్ములా-ఈ రేస్ ఒప్పందం అంతా పారదర్శకంగా జరిగింది. రేస్ నిర్వాహకులకు చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయి అని ఇదివరకే నేను వివరంగా చెప్పడం జరిగింది. అయినా మీ ప్రభుత్వం మాత్రం దుష్ప్రచారం మానడం లేదు. రాష్ట్ర ప్రజలకు నిజాలేమిటో తెలుసుకునే హక్కు ఉన్నది. కనుక మీరు శాసనసభలో ఈ అంశంపై చర్చ పెట్టాలని నేను డిమాండ్ చేస్తున్నాను. అన్ని విషయాలు సవివరంగా రాష్ట్ర ప్రజలకు శాసన సభ వేదికగా చెబుదాం. శాసన సభ సెషన్ జరుగుతున్నది కనుక మీకు అనుకూలమైన రోజే ఈ చర్చను పెట్టండి. మరోసారి చెబుతున్నాను. ఫార్ములా-ఈ అంశంలో ఎలాంటి అవకతవకలు కానీ, అవినీతి కానీ జరగలేదు. రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి చేసే ఈ రేస్‌ను కేవలం మీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు బలి చేశారు. దీనిపైన శాసనసభలో సవివరమైన చర్చ జరిగితే నిజానిజాలేమిటో నిగ్గుతేలుతాయి" అని కేటీఆర్ పేర్కొన్నారు.

ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి వేములవాడ పర్యటన సందర్భంగా.. సీఎం, మంత్రుల భోజనాల ఖర్చు నిమిత్తం.. ఒక్కో ప్లేటుకు రూ. 32 వేలు ఖర్చు చేసినట్లు వచ్చిన వార్తా కథనాలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ ప్రభుత్వ అడ్డగోలు అప్పులు, ఖర్చులను కేటీఆర్ ఎండగట్టారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఒక్క ఇటుక పెట్టలేదు, గుప్పెడు మన్ను తియ్యలేదు.. కానీ లక్ష ఇరవై మూడు వేల కోట్ల అప్పు ఎందుకు చేశారని కేటీఆర్ ప్రశ్నించారు. అప్పు సరే కానీ భోజనాలు బాగా అయ్యాయా? అని వేములవాడ పర్యటన సందర్భంగా రేవంత్ సర్కార్ చేసిన ఖర్చును కూడా కేటీఆర్ ప్రస్తావించారు. అందరూ కడుపునిండా తిన్నారా..? తిన్నాక పాన్ వేసుకున్నారా? రూ. 32,000 ప్లేట్ భోజనం అంటే అరగాలి కదా? అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు.



## నిరసనలతో కదంతొక్కిన కార్మికులు

**బలగం టీవీ , తంగళ్లపల్లి**

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ ధర్నా కార్యక్రమానికి వెళ్లిన కార్మికులను అరెస్టు చేసిన విధానంపై తంగళ్ళపల్లి ఎంపీడీవో ఆఫీస్ ఎదుట కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎంపీడీవో కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచిన కూడా గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పట్టించుకోవడం లేదని అన్నారు. వెంటనే గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బుర్ర శ్రీనివాస్, రమేష్ చంద్ర, కంసాని రవీందర్ పి రాజు, తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ య్యూట్యూబ్ ఛానల్ హ్యాక్

**బలగం టీవి, హైదరాబాద్**

టీడీపీ అధికారిక య్యూట్యూబ్ ఛానల్‌ను దుండగులు హ్యాక్ చేశారు. ఆన్ చేస్తే, స్ట్రక్ అవుతుందని ఫిర్యాదు చేశారు. దాంతో రంగంలోకి దిగింది టిడిపి టెక్నికల్ వింగ్. హ్యాకర్లను గుర్తించడానికి. యాజామాన్యానికి పార్టీ వర్గాలు ఫిర్యాదు చేశారు. య్యూట్యూబ్ ఛానల్ పునరుద్ధరణకు ప్రయత్నం చేయడానికి ప్రయత్నిస్తున్నట్టు తెలిసింది.

# మాదకద్రవ్యాల నియంత్రణ ప్రతీ ఒక్కరి బాధ్యత..

- మాదకద్రవ్యాల నియంత్రణకు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేయాలి..
- విద్యా సంస్థలలో యాంటి డ్రగ్స్ పై వ్యాస రచన పోటీల నిర్వహణ
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా




**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

మాదకద్రవ్యాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామస్థాయి నుంచి డ్రగ్స్, గంజాయి సమస్య పరిష్కారం కోసం అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. బుధవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని ఎస్పీ అఖిల్ మహజాన్ తో కలిసి సంబంధిత అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్.డి.పి.ఎస్ కేసులు, గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు, మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ డ్రగ్స్ గురించి ఫీల్డ్ లెవల్ నుంచి సమాచారం అందాలని, ప్రతి గ్రామం నుంచి పంచాయతీ కార్యదర్శి గంజాయి సమస్య పరిష్కారం పై సమాచారం అందించాలని, గ్రామంలో ఎవరు గంజాయి కి బానిసలు అవుతున్నారు మొదల వివరాలు అందించాలనిఅన్నారు .

గంజాయి సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా స్థానిక పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని, మీ వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. పాఠశాలలో డ్రగ్స్, గంజాయి నివారణ పై వ్యాస రచన పోటీలు, పేయింటింగ్ పోటీలు ప్రతి నెలా నిర్వహించాలని అన్నారు. డ్రగ్స్ నియంత్రణ పై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని అన్నారు. మాదకద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్ నియంత్రణకు జిల్లాలో సంబంధిత శాఖ అధికారులను పక్కా కార్యాచరణతో కృషి చేయాలని అన్నారు.

జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా బెల్ట్ షాపు లు ఉంటే జిల్లా ఎక్సైజ్ అధికారి 8712658827 నెంబర్ కు సమాచారం అందించాలని, బెల్ట్ షాపులను తొలగించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. విద్యా సంస్థల్లో నిర్వహించే పేరెంట్ టీచర్స్ సమావేశాలలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలు, డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు గా మారితే వచ్చే పరిణామాలు, మాదకద్రవ్యాల బానిసత్వం నివారణకు ప్రభుత్వం సిరిసిల్ల రాజీవ్ నగర్ బస్తీ దవఖానలో ఏర్పాటు చేసిన డి అడిక్షన్ సెంటర్ మొదలగు అంశాలను వివరించాలని, పేరెంట్స్ చుట్టుపక్కల ఎవరైనా పిల్లలు మాదక ద్రవ్యాలకు అలవాటు పడినట్లు తెలిస్తే వెంటనే సమాచారం అందజేయాలని అన్నారు .

డ్రగ్స్ వల్ల కలిగే విపరీత పరిణామాల పై అవగాహన వివరిస్తూనే సమాంతరంగా వాటి నియంత్రణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, మాదక ద్రవ్యాల రవాణా, సాగు, వినియోగం నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఎస్పీ అఖిల్ మహజాన్ మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో డ్రగ్స్ మాదకద్రవ్యాల నియంత్రణకు పక్కా నిఘా ఏర్పాటు చేశామని, గత సంవత్సర కాలంగా మాదకద్రవ్యాలకు సంబంధించి 95 కేసులో నమోదు చేసి దీనికి సంబంధించిన 214 పైగా వ్యక్తులను అరెస్టు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు.

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

డ్రగ్స్ నివారణ కోసం సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు .మాదక ద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్, గుడెంబా సంబం ధించి పౌరులకు ఎటువంటి సమాచారం ఉన్నా వెంటనే కంట్రోల్ రూమ్ నెంబర్ 8712656426 కు తెలియజేయాలని , సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.

గ్రామ స్థాయి నుంచి డ్రగ్స్, గంజాయి అలవాటు ఉన్నట్లు ఏదైనా అనుమానం కలిగితే వెంటనే తమకు సమాచారం అందించాలని, మా దగ్గర అవసరమైన మేర డ్రగ్స్ నిర్ధారణ కిట్లు, నార్కోటిక్స్ గుర్తించే డాగ్స్ అందు బాటులో ఉన్నాయని వెంటనే పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో వెంకట ఉపేందర్ రెడ్డి, ఇన్చార్జి డిపివో శేషాద్రి, డిఏవో . అఫ్జలి బేగం, డిఐఈ వో . శ్రీనివాస్, జిల్లా ఎక్సైజ్ అధికారి పంచాక్షరి, విద్యా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# చెట్లు నరికిన వ్యక్తులపై కేసు నమోదు

**బలగం టీవీ, ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ గ్రామ శివారులో ముగ్గురు వ్యక్తులు తాటి చెట్లను నరికిన సంఘటనలో ముగ్గురు పై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. గ్రామ శివారులోని 479 సర్వే నెంబర్ లోని బాలసాని నారాయణ, బాలరాజ్, నగేష్ అనే వ్యక్తులు 25 తాటి చెట్లను నరికేశారు. గౌడ కుల సంఘ సభ్యులు సమాచారం అందించడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పై ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని సీఐ తెలిపారు. గౌడ కులస్తుల కుల ఉపాధి అయినటువంటి తాటి చెట్ల నుంచి వచ్చే కళ్ళు అమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటున్నారని, ఇలా చెట్లను నరికి వేయడంతో ఉపాధి కోల్పోతున్నామని గౌడ సంఘ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.



# క్రీడలతో స్నేహ సంబంధాలు..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్

**బలగం టీవీ , సిరిసిల్ల**

క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు . సీఎం కప్ పోటీల్లో భాగంగా ఇటీవల గ్రామస్థాయి, మండల స్థాయి ఆటలు ఇటీవల నిర్వహించగా, బుధవారం జిల్లా స్థాయి పోటీల కార్యక్రమాన్ని కలెక్టర్, ఎస్పీ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి, క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం వాలీ బాల్ కలెక్టర్, ఎస్పీ ఆడి క్రీడాకారులను ఉత్తేజ పరిచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలుగులోకి తీసుకు వచ్చి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించేలా తీర్చిదిద్దేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమం లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప రెడ్డి, జిల్లా యువజన అండ్ స్పోర్ట్స్ అధికారి రాందాస్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ లావణ్య ఎస్జిఎఫ్ సెక్రటరీ మరియు ప్రభుత్వ,ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాల భవన నిర్మాణానికి భూమి పూజ..



**బలగం టీవీ ,ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలో నూతనంగా మంజూరైన నూతన అంగన్వాడి భవన నిర్మాణానికి సిడిపివో గుర్రం ఉమారాణి, సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ శాసనసభ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ బుధవారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ప్రాజెక్టు తరపున 31 అంగన్వాడి కేంద్రాల భవన నిర్మాణానికి ఒక్కో అంగన్వాడికి 12 లక్షల నిధులు మంజూరు అయ్యాయని (8 లక్షలు ఎంజీఎంఆర్జిఎస్ ,2 లక్షలు 15 వ ఆర్థిక సంఘం నిధులు,2 లక్షలు డబ్ల్యూ డి, సి డబ్ల్యూ నిధులు), నిధులు మంజూరుకు సహకరించిన కేకే మహేందర్ రెడ్డి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, పై అధికారులకు సి.డి.పి.ఓ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండల సూపర్వైజర్ నాంపల్లి రాజేశ్వరి, ఎమ్మార్వో రామచంద్రం, డిప్యూటీ ఎమ్మార్వో బొబ్బిలి సత్యనారాయణ,కార్యదర్శి పంతులవారి సంతోష్ స్పెషల్ ఆఫీసర్ సంతోష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి,తాజా మాజీ సర్పంచ్ కొండాపురం బాల్రెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ సాహెబ్, ఎల్లారెడ్డిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ షేక్ సబేరా బేగం–గౌస్ బాయ్, గంభీరావుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ– తిరుపతి పటేల్,కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు చల్ల పద్మారెడ్డి, మాజీ అధ్యక్షులు కొంగరి కిష్టారెడ్డి, నంది కిషన్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పొత్తూరి శివకుమార్ గౌడ్, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ సయ్యద్ సాదియా, అంగన్వాడీ టీచర్ బొప్పవరం పద్మ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుడిది రాజేందర్, మేడిపల్లి రవి తదితరులు పాల్గొన్నారు.




## 31 లోగా సర్వే పనులు పూర్తి చేయాలి..

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్దేశిత సమయంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేయాలనీ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.బుధవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇందిరమ్మ ఇండ్ల సర్వే పై సంబంధిత అధికారుల, పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ సిరిసిల్ల జిల్లాలో ప్రజాపాలన దరఖాస్తుల ద్వారా ఇందిరమ్మ ఇండ్ల కోసం మనకు 1లక్షా 7వేల 398 దరఖాస్తులు వచ్చాయని, ఇప్పటి వరకు వీటిలో 15వేల 510 దరఖాస్తుదారుల ప్రస్తుత నివాసం ఇందిరమ్మ యాప్ లో క్యాప్చర్ చేయడం జరిగిందని అన్నారు. ప్రతి రోజూ పంచాయతీ కార్యదర్శి 25 ఇండ్లు మేరకు ఇందిరమ్మ ఇండ్ల సర్వే పూర్తి చేయాలని, గ్రామాల్లో అవసరమైతే అదనపు లాగిన్లు తీసుకుని సర్వే వేగవంతం కావాలని, ఏవైనా సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. అనంతరం జిల్లాలోని మండలాల్లో వివిధ గ్రామాల్లో జరుగుతున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెల్ టవర్ నెట్వర్క్ ప్రాబ్లమ్స్ ఎదురైతే ఆఫ్ లైన్ ద్వారా కూడా నమోదు చేయవచ్చని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని, నిర్దేశిత సమయం డిసెంబర్ 31 లోగా సర్వే పనులు పూర్తి కావాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్చార్జి జిల్లా పంచాయతీ అధికారి శేషాద్రి, ఎం.పి.డి.ఓ లు, పంచాయితి కార్యదర్శులు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలి

- వైద్యాధికారులు

**బలగం టీవీ , వీర్నపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. వసంతరావు రాజన్న సిరిసిల్ల అధ్యక్షతన జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో వందరోజుల టిబి నియంత్రణ కార్యక్రమం లో ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గర్జనపల్లి గ్రామంలో (టీబీ ) నిశ్చయి శిబిర్ డాక్టర్ విష్ణు, డాక్టర్ బ్లేస్సి, డాక్టర్ దివ్య టీ బి ప్రోగ్రాం ఆఫీసర్, డాక్టర్ సారియా అంజుమ్, డాక్టర్ చిరంజీవి ల ఆధ్వర్యంలో గర్జనపల్లి గ్రామంలో కార్యక్రమం ఏర్పాటు చేయ నైనది. ఈ కార్యక్రమం లో జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ టీబీ అనే వ్యాధి (గాలి తుంపర్ల ద్వారా) ఊపిరితిత్తులకు శరీరంలోని ఇతర భాగాలకు కూడా టీబీ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. టీబీ వ్యాధిని గుర్తించడం గ్రామంలోని ప్రజలందరికీ అవగాహన ఉండాలని ఈ సందర్భంగా తెలియజేసినారు. డాక్టర్ విష్ణు డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ మాట్లాడుతూ టీబీ వ్యాధి వచ్చి తగ్గిన వారి, టీబీ మందులు వాడుతున్న వారి కుటుంబ సభ్యుల కు, షుగర్ వ్యాధిగ్రస్తులకు( దీర్ఘకాల వ్యాధిగ్రస్తులకు) టీబీ వ్యాధి పరీక్షలు( తెమ్మడ) ఎక్రే పరీక్షల చేయవలసిన అవసరం ఉందని, టిబి పై అపోహలు తొలగించాలని తెలియజేస్తూ, టీబీ అవగాహన శిబిరాలు గ్రామాలలో ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలలో టీబీ వ్యాధి గుర్తించబడి, చికిత్స చేసుకొని టీబీ రహిత గ్రామాలుగా నిలవాలని ఈ సందర్భంగా తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు బ్లేస్సి, దివ్య, సారియా అంజు, చిరంజీవి గార్లు, టి.బి సూపర్వైజర్లు బిగిందర్ ,మహిపాల్ ,నాగరాజు ,పద్మ , ఏఎన్ఎంలు మంజుల, ఇందిరా మరియు ఆశలు పాల్గొన్నారు.

# గబ్బా టెస్టు డ్రా

- 260 పరుగులకు భారత్ ఆలౌట్
- 89/7 స్కోర్ వద్ద సెకండ్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన ఆస్ట్రేలియా
- వర్షం అంతరాయంతో తేలని ఫలితం
- ఇరుజట్లు 1-1తో సమం



**బలగం టీవీ, బ్రిస్బేన్**

భారత్- ఆస్ట్రేలియా మధ్య బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానంలో జరుగుతున్న భారత్-ఆస్ట్రేలియా టెస్టు డ్రా గా ముగిసింది. 275 పరుగుల లక్ష్యంలో బరిలోకి దిగిన భారత్ టీ విరామ సమయానికి 8-0తో నిలిచింది. ఆటకు వర్షం తీవ్ర అంతరాయం కలిగించడం వల్ల మ్యాచ్‌ను డ్రా గా ముగిస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. దీంతో ఐదు టెస్టుల సిరీస్‌లో ఇరుజట్లు 1- 1తో సమంగా నిలిచాయి. భారీ సెంచరీతో అదరగొట్టిన ఆస్ట్రేలియా బ్యాటర్ ట్రావిస్ హెడ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు' లభించింది.

ఐదో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 252-9 తో ఐదో రోజు ఆట ప్రారంభించిన టీమ్ఇండియా మరో 8 పరుగులు జోడించి 260 పరుగులకు ఆలౌటైంది. ఆ తర్వాత సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభం అవ్వడానికి ముందు మళ్లీ వర్షం అడ్డుకుంది. తర్వాత ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆడేయడం ప్రారంభించింది. కానీ, భారత బౌలర్లు అదరగొట్టారు. దాంతో ఆస్ట్రేలియా రెండు ఇన్నింగ్స్‌లో 89 రన్స్‌కే 7 వికెట్లు కోల్పోయిన దశలో ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. ఇక 275 రన్స్ టార్గెట్‌తో ఇండియా బరిలోకి దిగింది. సెకండ్ ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా బ్యాటర్లలో మెక్‌స్వీనీ 4, ఉస్మాన్ ఖవాజా 8, మార్నస్ లబుషేన్ 1, మిచెల్ మార్ష్ 2, ట్రావిస్ హెడ్ 17, స్టీవెన్ స్మిత్ 4, అలెక్స్ క్యారీ 20, ప్యాట్ కమ్మిన్స్ 22, మిచెల్ స్టార్క్ 2 (నాటౌట్) చొప్పున పరుగులు చేశారు. బుమ్రా 3, సిరాజ్, ఆకాశ్ దీప్‌లకు చెరో 2 వికెట్లు దక్కాయి.

భారత్ బ్యాటింగ్ ప్రారంభమైన కొద్ది సేపటికే మళ్లీ వర్షం పలకరించింది. దాంతో అంపైర్లు టీ బ్రేక్ ప్రకటించారు. అయితే ఇక తగ్గే సూచనలు లేకపోవడం వల్ల అంపైర్లు మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. ఇక భారత్-ఆసీస్ మధ్య నాలుగో టెస్టు డిసెంబర్ 26న ప్రారంభం కానుంది.



## బుమ్రా అరుదైన ఘనత

బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బ్రిస్బేన్‌లోని గబ్బా స్టేడియంలో జరుగుతున్న మూడో టెస్టులో భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా అరుదైన ఘనత సాధించాడు. ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో ఆ జట్టు ఓపెనర్ ఉస్మాన్ ఖవాజాను క్లీన్‌బోల్డ్ చేయడంతో పాటు మరో బ్యాటర్ మార్నస్ లబుషేన్‌ను పెవిలియన్ చేర్చడంతో బుమ్రా కంగారుల గడ్డపై అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా అవతరించాడు. భారత దిగ్గజం కపిల్ దేవ్‌ను వెనక్కి నెట్టి ఈ రికార్డును సొంతం చేసుకున్నాడు. ఆసీస్‌లో బుమ్రా 10 మ్యాచుల్లో (బ్రిస్బేన్ టెస్టుతో కలిపి) 52 వికెట్లు తీశాడు. కపిల్ 11 మ్యాచుల్లో 51 వికెట్లు పడగొట్టాడు. ఈ ఇద్దరి తర్వాత ఆస్ట్రేలియాలో అత్యధిక వికెట్లు సాధించిన భారత బౌలర్ల జాబితాలో అనిల్ కుంబ్లే (10 మ్యాచుల్లో 49 వికెట్లు), రవిచంద్రన్ అశ్విన్ (11 మ్యాచుల్లో 40 వికెట్లు), బిషన్ సింగ్ బేడి (7 మ్యాచుల్లో 35 వికెట్లు) ఉన్నారు.



# అంతర్జాతీయ క్రికెట్‌కు అశ్విన్ గుడ్ బై

**మూడో టెస్టు అనంతరం రిటైర్‌మెంట్ నిర్ణయాన్ని మీడియాకు వెల్లడించిన ఆల్ రౌండర్..**

**బలగం టీవీ, బ్రిస్బేన్**

ఆల్‌రౌండర్, ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్.. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బ్రిస్బేన్‌లో జరిగిన మూడవ టెస్టు చివరి రోజు అశ్విన్ తన రిటైర్మెంట్ ప్రకటించాడు. 38ఏళ్ల అశ్విన్ రిటైర్మెంట్ ఇప్పట్నుంచే అమలుకానుంది. మ్యాచ్ తర్వాత కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి అశ్విన్ మాట్లాడారు.

'ఇంటర్నేషనల్ క్రికెట్‌లో భారత్ తరపున ఇదే నా ఆఖరి మ్యాచ్. ఈ జట్టుతో నాకు ఎన్నో అనుభూతులు ఉన్నాయి. నా కెరీర్‌లో మద్దతుగా నిలిచిన బీసీసీఐ, నా సహచరులకు కృతజ్ఞతలు. ముఖ్యంగా రోహిత్, విరాట్, అజింక్యా రహానే, ఛతేశ్వర్ పుజారా. నా జర్నీలో కోచ్‌ల పాత్ర కూడా ఎంతో ఉంది. ఆస్ట్రేలియా క్రికెట్‌కు కూడా థాంక్స్. మీతో ఆడడాన్ని బాగా ఎంజాయ్ చేస్తాను. ఇది నాకు ఎమోషనల్ మూమెంట్' అని అశ్విన్ అన్నాడు. ఇక రిటైర్‌మెంట్ ప్రకకటించిన అశ్విన్ గురువారం భారత్‌కు రానున్నాడు. ఈ మేరకు కెప్టెన్ రోహిత్ శర్మ తెలిపాడు. మ్యాచ్ అనంతరం ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పలు విషయాలపై రోహిత్ మాట్లాడాడు. అశ్విన్ నిర్ణయాన్ని గౌరవిస్తున్నామని తెలిపాడు. కాగా, అశ్విన్ రిటైర్మెంట్‌పై బీసీసీఐ కూడా పోస్ట్ షేర్ చేసింది. 'థాంక్స్ అశ్విన్. అద్భుతం, ఇన్నోవేషన్, తెలివైన బౌలర్‌కు నువ్వు పర్యాయపదంగా మారావు. సీనియర్ స్పిన్నర్‌గా భారత్ విజయాల్లో కీలక పాత్ర పోషించావు. లెజండరీ కెరీర్‌ను కొనసాగించినందుకు కంగ్రాట్స్' అని బీసీసీఐ పోస్టు పెట్టింది.

టెస్టు కెరీర్‌లో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు అశ్విన్. అతను 106 టెస్టుల్లో 24 యావరేజ్‌లో 537 వికెట్లు తీసుకున్నాడు. అనిల్ కుంబ్లే తర్వాత రెండో స్థానంలో ఉన్నాడతను. కుంబ్లే 132 టెస్టుల్లో 619 వికెట్లు తీసిన విషయం తెలిసిందే. ఇక అశ్విన్ కేవలం బౌలర్ మాత్రమే కాకుండా, అద్భుతమైన బ్యాటర్ కూడా. 25.53 సగటుతో 3,503 టెస్ట్ పరుగులు చేశాడు.

# 'బచ్చల మల్లి'లో మంచి సందేశం ఉంది

**బలగం టీవి, హైదరాబాద్**



హీరో అల్లరి నరేష్ నటించిన తాజా చిత్రం 'బచ్చల మల్లి'. సోలో బ్రతుకే సో బెటర్ ఫేమ్ సుబ్బు మంగాదేవి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అమృత అయ్యర్ హీరోయిన్ గా నటిస్తున్నారు. సామజవరగమన, ఊరు పేరు భైరవకోన బ్లాక్‌బస్టర్స్ తర్వాత హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మించారు. బచ్చల మల్లి సినిమా ఈనెల 20న క్రిస్మస్ సందర్భంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో అల్లరి నరేష్ మీడియాతో మాట్లాడారు.

డైరెక్టర్ సుబ్బు ఈ కథ చెప్పినప్పుడు సింగల్ సిట్టింగ్‌లోనే ఓకే అయింది. కథ అంత అద్భుతంగా ఉంది. ఇప్పటి వరకు నేను చేసిన సినిమాల్లో చాలా వైవిధ్యాలు ఉన్న క్యారెక్టర్ ఇది. ఇందులో హాస్యరసం తప్పా అన్ని వైవిధ్యాలు ఉన్నాయి. నాంది తర్వాత విభిన్నమైన సినిమాలని చేద్దామనుకున్నాను. అలా మంచి కంటెంట్ సినిమాల కోసం చూ స్తున్న సమయంలో ఈ సినిమా వచ్చింది. నిర్మాత రాజేష్‌కి కూడా చాలా నచ్చింది. అలా ఈ ప్రాజెక్టు మొదలైంది. గమ్యం సినిమాలో గాలి శీను ఎలా గుర్తుండిపోయాడో బచ్చలమల్లి కూడా ఓ పదేళ్ల పాటు గుర్తుండిపోతాడు. క్యారెక్టర్ ప్రభావం అలా ఉంటుంది. నా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి కొత్తగా ప్రయత్నించాను. డైరెక్టర్ సుబ్బు ఊరిలో బచ్చల మల్లి అనే ఒక క్యారెక్టర్ ఉంది. ఆయన ఊరిలో గొడవలను కూడా తన గొడవలుగా ఫీల్ అయ్యే మనిషి. ఆయన జీవితంలోని మూడు సంఘటనలను తీసుకొని పూర్తిగా ఒక విభిన్నమైన సబ్జెక్టును ఈ సినిమాలో చెప్పడం జరిగింది.

ప్రతి మనిషిలోనూ బచ్చలమల్లి లాంటి క్యారెక్టర్ ఉంటుంది. మనకు తెలియకుండానే జీవితంలో కొన్ని నిర్ణయాలు మూర?త్వంతో తీసుకుంటాం. ఇందులో తెలియకుండానే ఒక మంచి సందేశం కూడా ఉంది. మా డైరెక్టర్ నా నడకలో కూడా ఒక మూర్ఖత్వం చూపించాలి అని అడిగారు. నా గత సినిమాల బాడీ లాంగ్వేజ్ ఎక్కడ కూడా కనిపించకూడదని చాలా జాగ్రత్తగా పడ్డారు. ఈ సినిమా చూసిన ఐదు నిమిషాల తర్వాత అల్లరి నరేష్‌ని మర్చిపోయి బచ్చల మల్లినే చూస్తారు. బచ్చలమల్లి జీవితంలోకి కావేరి అనే అమ్మాయి ప్రవేశించిన తర్వాత ఆ అమ్మాయి కోసం మారుతాడు. ఆ మారే క్రమంలో తను చేసిన పాత తప్పులన్నీ ఎదురవుతుంటాయి. ఫైనల్‌గా తను ఏ వైపు టర్న్ తీసుకున్నాడు అనేది ఆసక్తికరంగా ఉంటుంది. అమృత అయ్యర్ చాలా చక్కగా నటించింది. ఇందులో రావు రమేష్, అచ్యుత్ కుమార్, వైవాహర్ష, హరితేజ, రోహిణి .. అన్నీ పాత్రలు కథలో చాలా కీలకంగా ఉంటాయి. ఇందులో తండ్రి, కొడుకు మధ్య భావోద్వేగం చాలా బాగుంటుంది. విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ నాకు చాలా ఇష్టం. సినిమా లో నాలుగు పాటలు ఉన్నాయి. విశాల్ చంద్రశేఖర్ చాలా సమయం తీసుకుని చాలా అందంగా ఆ పాటల్ని చేయడం జరిగింది. పాటలకు చాలా ప్రాముఖ్యత ఉంటుంది.

# అందుకే ఇండస్ట్రీకి దూరమయ్యా.. : రమణ గోగుల

**బలగం టీవి, హైదరాబాద్**



స్వరకర్తగా, గాయకుడిగా తెలుగు ప్రేక్షకులకు సుపరిచితుడు రమణ గోగుల. కెరీర్‌లో ఎన్నో సూపర్‌హిట్ ఆల్బమ్స్ అందించారు. అయితే ఆయన గత కొన్నేళ్లుగా ఇండస్ట్రీకి దూరంగా ఉంటున్నారు. సుదీర్ఘ విరామం తర్వాత ఆయన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో 'గోదారి గట్టు..' అనే గీతాన్ని ఆలపించారు. ఈ పాట ఇమ్యూజిక్ చార్ట్స్‌లో అగ్రభాగాన కొనసాగుతున్నది. ఇప్పటికే 27 మిలియన్ల వ్యూస్‌ను దక్కించుకుంది. వెంకటేష్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందిన 'సంక్రాంతికి వస్తున్నాం' జనవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా రనేను యూఎస్‌లో ఉంటున్నా. వ్యక్తిగత జీవితంలో బిజీ కావడం వల్ల ఇండస్ట్రీకి దూరంగా ఉన్నా. నేను యూఎస్‌లో ఉన్నప్పుడు చిత్ర సంగీత దర్శకుడు భీమ్స్ కాల్ చేసి తప్పకుండా పాట పాడాలని కోరాడు.సాంగ్ పంపిస్తే రెండుసార్లు విన్నా. చాలా బాగా నచ్చింది. అందులో కొత్తదనంతో పాటు మంచి ఫీల్ ఉందనిపించింది. దాంతో తప్పకుండా పాడాలని నిర్ణయించుకున్నా' అన్నారు. చాలా మంది ఫోన్ చేసి పాట బాగుందని, వాయిస్‌లో అదే మ్యాజిక్ ఉందని పొగడటం ఆనందంగా ఉందని, వెంకటేష్ కూడా ఫోన్ చేసి పాట గురించి మెచ్చుకున్నారని తెలిపారు. మళ్లీ మ్యూజిక్ డైరెక్షన్ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, తన వద్ద వినూత్నమైన ఐడియాస్ ఉన్నాయని, మంచి కథ, దర్శకుడు కాంబినేషన్ సెట్ అయితే తప్పకుండా కంపోజింగ్‌కు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. టెక్నాలజీ వల్ల మ్యూజిక్ కంపోజింగ్‌లో మార్పులొచ్చాయని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో సింగర్ అవసరం లేకుండా పాటను తయారుచేయొచ్చని, అయితే పాట తాలూకు ఆత్మ ఆవిష్కృతం కావాలంటే మావన గాత్రంతోనే సాధ్యమని రమణ గోగుల అభిప్రాయపడ్డారు. విదేశాల్లో మల్టీనేషనల్ కంపెనీల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డాటా ఎనలిటిక్స్ ప్రాజెక్ట్స్‌లో బిజీగా ఉండటం వల్ల సినిమాలకు గ్యాప్ వచ్చిందని ఆయన వివరించారు.

## శ్రీతేజ్‌కు అల్లు అరవింద్ పరామర్శ..

**బలగం టీవి, హైదరాబాద్**

ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనలో రేవతి (39) అనే మహిళ మృతి చెందగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ (9)కు గాయాలయ్యాయి. ప్రస్తుతం శ్రీతేజ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్ తండ్రి, నిర్మాత అల్లు అరవింద్ కిమ్స్ ఆస్పత్రికి వెళ్లారు. శ్రీతేజ్‌ను పరామర్శించి అతని ఆరోగ్యపరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం శ్రీతేజ కుటుంబసభ్యులతో మాట్లా డారు. ఈ సందర్భంగా అల్లు అరవింద్ మాట్లాడుతూ.. మృతి చెందిన మహిళ కుటుంబాన్ని పూర్తిగా ఆదుకుంటామన్నారు. కసు కోర్టులో ఉన్నందున అల్లు అర్జున్ రాలేకపోయారని అల్లు అర్జున్ తరపున తాను ఆస్పత్రికి వచ్చానని స్పష్టం చేశారు.

## రాజాసాబ్ విడుదల వాయిదా..?

- అదే తేదీకి సిద్దూ జొన్నల గడ్డ 'జాక్' విడుదల

**బలగం టీవి, హైదరాబాద్**



గ్లోబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న హార్రర్ కామెడీ జోనర్ చిత్రం రాజాసాబ్ . మారుతి డైరెక్ట్ చేస్తున్న ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. అలాగే డైరెక్టర్ బచ్చలమల్లి ప్రమోషనల్ ఈవెంట్‌లో పాల్గొని రాజాసాబ్ షూటింగ్ పూర్తయిందని క్లారిటీ ఇచ్చేశాడు. అయితే రాజాసాబ్ అనుకున్న సమయానికి రావడం లేదన్న వార్త ఒకటి సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. దాంతో పాటు అదే తేదీకి సిద్దూ జొన్నల గడ్డ నటిస్తున్న జాక్ సినిమా ఇదే తేదీన విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ప్రకటిస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. దాంతో రాజాసాబ్ వాయిదా పడినట్టేనని తెలుస్తోంది.అలాగే రాజాసాబ్ టీజర్ రన్‌టైం 2 నిమిషాల 15 సెకన్లు అని ఇన్‌సైడ్ టాక్. ఇక జాక్ మూవీని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి రాజమణి సంగీతం అందిస్తున్నారు.